# ఇదిగో నీ మనసు

రేవులో గాలికి పైకి లేచిన చీరలా ఎటువైపుకో ఎగురుతోంది మనసు. మూసుకున్న కమల ముందు ప్రేమలో బిగించినట్టు కదలకుండా అతని రూపమే కనబడుతోంది నర్మదకు.

ఆ ప్రేమలో వున్న మనిషి కార్తికేయరావు. గత కొన్ని రోజులుగా నర్మద మనసును డ్రిల్లింగ్ మెషీన్‌లా తొలిచేస్తున్నాడు. ఆమెను తోడుగా తీసుకుని మంచుపర్వతాల మీద స్కేటింగ్ చెస్తున్నవాడిలా అటూ ఇటూ పరుగులు తీస్తున్నాడు.

వారం రోజుల క్రితం కార్తికేయరావు ఆమెకు కనపడకుండా వున్నట్టయితే నర్మద ఇంత తీరుబడీగా బోర్లా వెల్లకింతలా పక్కకు తిరిగి – దుప్పటి మొహాన వేసుకుని – దిండును గుండెలకు అదుముకుని పడుకుంది అర్ధంలేని, అంతు వుండని పగటికలలు కనేదికాదు.

కాని అతను మాత్రం ఏం చెయ్యగలడు? అవసరం అతన్ని రైలింజన్‌లా నెట్టుకువచ్చి నర్మద ఎదురింట్లో వున్న గదిలో పడేసి వెళ్లిపోయింది.

ఇహ కళ్లు మూసుకోలేక మొహంమీద దుప్పటిని లాగే కళ్లు తెరిచి ఎదమీద దిండును పక్కకు ఈడ్చి మంచం దిగింది. నర్మద కార్తికేయరావు గదిలోంచి బయటకు వెళ్లకముందే ఈ కలలు ఎందుకు? అతన్నోసారి చూడాలనుకున్నది.

ముందుగదిలోకి వచ్చి కిటికీ దగ్గర నిల్చుంది.

అతనూ ఆ టైముకు కిటికి దగ్గరే నిల్చుని ఇనుప చువ్వల మధ్య అద్దాన్ని ఇరికించి ఎడమచేత్తో జుట్టును నొక్కుతూ కుడిచేత్తో దువ్వెనతో వెనక్కు దువ్వుకుంటున్నాడు.

ఎంత అందమయిన నొక్కుల జుట్టు! అనుకుంది ఆమె. నర్మదకు తనే స్వయంగా అతనికి క్రాఫు దువ్వాలనిపించింది. ఆ క్షణంలో రివ్వున పరుగెత్తుకువెళ్లి ఆమె మనసులో ఆలోచనను గ్రహించినట్టు వెంటనే అతను తలెత్తి నర్మదను చూసి తమాషాగా నవ్వీ నవ్వనట్టుగా నవ్వాడు. అతడి నవ్వునీ, అతడి చూపులనీ తట్టుకోలేకపోయింది నర్మద.

విశాలంగా వున్న ఆ కళ్లు ఎంత తెల్లగా వున్నాయనుకుంది. నవ్వినప్పుడు పెదవులు అరవిచ్చుకున్న మొగలిపువ్వుల్ల వున్నట్లనిపించింది.

నవ్వుతూనే కార్తికేయరావు దువ్వెనతో మీసాలను కూడా దువ్వుతున్నాడు.

అతడి చర్యకు ఆమె మరింత ఆశ్చర్యానికి లోనయ్యింది. ఇతగాడికి అందం గురించి ఎంత శ్రద్ధ? ఈ దేశంలో మీసాలను కూడా దువ్వుకునే మగాళ్లెంతమంది వుంటారు? అనుకుంది.

కిటికీ చువ్వల మధ్య ఇరికించిన అద్దాన్ని లాగేశాడు కార్తికేయరావు. ఇహ తల దువ్వుకునే కార్యక్రమం అయిపోయిందన్నట్టు క్షణంలో కిటికీ తలుపులను మూసి బయటకు వచ్చి గదికి తాళం పెట్టాడు. శతదినోత్సవ సభలో ప్రేక్షకుల చప్పట్లు మధ్య స్టేజీమీదకు వెళుతున్న హీరోలా నవ్వుమొహంతోనే మెట్లు దిగి కిందికి వచ్చి అదే నవ్వుతో నర్మదను దాటి విశాలమైన కళ్లతో ఆమెను చూస్తూ వెళ్లిపోయాడు కార్తికేయరావు.

కారు దాటిపోయినా పెట్రోలు పొగ వాసన వదిలిపోనట్టు కార్తికేయరావు వెళ్లిపోయినా అతడి గురించిన ఆలోచనలు మాత్రం నర్మదను వదిలి వెళ్లలేదు. అందమైన అతడి కళ్లు, ఆ చూపులు ఆమెను ఇంకా వెంటాడుతున్నట్టుగానే అనిపించాయి. ఆ చూపులు నర్మదను పరవశింపచేశాయి. మగాడి కళ్లలో అంతటి ఆకర్షణ, ఆ చూపులకు ఆడదాని గుండెల్లోకి సూటిగా దూసుకుపోయే శక్తి వుంటాయని నర్మద మొదటిసారిగా తెలుసుకుంది.

మధ్యగదిలో గోడనున్న గడియారం పది గంటలు కొట్టటంతో ఆలోచనల నించి బయటపడింది నర్మద. అప్పుడు కొబ్బరిచెట్టుమీద నించి కిటికీమీదకు పడుతున్న ఎండ కనపడింది. గాలికి ఊగుతున్న గులాబిమొక్క నర్మద కళ్లకి కార్తికేయరావు నా కళ్లకీ అందంగానే వున్నాడని తల ఊపుతున్నట్టనిపించింది.

అతని కేం లోటు? అనుకుంది నర్మద.

మూడ్రోజుల క్రితమే చప్పిడిముక్కు పూడుకుపోయిన కళ్లతో చైనా ఆడదాని అందానికీ ఏ రకంగానూ తీసిపోని అనూష అనే అమ్మాయి కార్తికేయరావు గురించిన భోగట్టాను సేకరించి నర్మదకు వినిపించింది.

అతడికి బేంక్‌లో ఉద్యోగం. ఒక్కడే కొడుకు కోనసీమలో కొబ్బరితోటలు, కనిగిరిలో కుంకుడుతోటలూ వున్నాయట. ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం లేకపోయినా రాజ్యపట్టాభిషేకానికి ముందు ఒక ఏడాది దేశాటనకు బయల్దేరే యువరాజులా అతనూ ఉద్యోగమంటూ వచ్చాడుట లోకానుభవంకోసం. అంతేకాకుండా ఇంకో విషయాన్ని కూడా చెప్పింది అనూష. తన మనసుకు నచ్చిన అమ్మాయిని కొంగుకు ముడేసుకుని వెళ్లే ఆలోచనలో కూడా వున్నాడట కార్తికేయరావు.

"ఇవన్నీ నీకెట్టా తెలుసు?" అన్నది నర్మద.

"మరి నేనంటే ఏమనుకున్నావ్? చెప్పేను" అన్నది అనూష వెకిలిగా నవ్వుతూ.

"ఇంతకీ మనసుకు నచ్చిన అమ్మాయి దొరికిందా అతడికి?" అడిగింది నర్మద.

"దొరికినట్టు లేదు. ఎవ్వరూ దొరక్కపోతే నన్ను చేసుకుంటానంటాడేమో" అన్నది అనూష సిగ్గుపడి.

"సర్లే వెళ్లు.... మీ అమ్మ నీకోసం చూస్తూ వుంటుంది" అన్నది నర్మద ఆ ఆలోచనను భరించలేనట్టు. ఆ చైనా మ్యొగం అనూ' ఇంతా ఏం మాట్లాడుతుందోనని పంపించివేసింది.

"ఇంత లేటుగా వెళుతున్నావేం?" తల్లి మాటలు వినిపించాయి నర్మదకు.

"ఫస్టవర్ లేదులే" అంటూ పుస్తకాలతో ముందుగదిలోకి వచ్చింది నర్మద చెల్లెలు ఇందుమతి.

కిటికీ దగ్గర నిల్చుని వున్న అక్కను చూసి "ఇంకా స్నానం చెయ్యలేదుకదూ?" అన్నది.

మాట్లాడలేదు నర్మద.

"నువ్వీమధ్య ఎందుకో మూడీగా వుంటున్నావే అక్కా" అని వెళ్లిపోయింది ఇందుమతి కాలేజీకి.

నవ్వుకుంది నిర్మల.

పిచ్చిమొహంది. తన మనసులో పల్టీలు కొడుతున్న ఆలోచనలలు దీనికేం తెలుసు? అనుకుంది.

ఉన్నట్టుండి హఠాత్తుగా రైలుదిగిన ప్రయాణీకుడికి అరమైలు నడిచిన తర్వాత రైల్లో మరచిపోయిన సూట్కేసు గుర్తుకొచ్చినట్టు నర్మదకు ప్రకాశం గుర్తుకువచ్చాడు.

ప్రకాశం నర్మద బావ. అక్కడికి దగ్గిరిలో వున్న ఊళ్ళో ఒక పళ్లపొడి తయారుచేసే కంపెనీలో సేల్స్ రిప్రజెంటేటివ్ కమ్ సేల్స్‌మేన్‌గా కమీషన్ పద్ధతిపై ఉద్యోగం చేస్తున్నాడు. చేసుక్కు పెళ్ళాంచేత కూడా ఏదయినా ఉద్యోగం చేయిస్తే ఇద్దరూ హాయిగా బతికే సంపాదన అతనిది.

అతను పళ్లపొడి పేకెట్లు అమ్మటానికి వచ్చినప్పుడల్లా నర్మదా వాళ్లింటికి వస్తూవుంటాడు. ప్రకాశం గుర్తుకురాగానే చెర్లోనించి బయటకు వచ్చి గట్టున

బట్టలు కనపడని ఆడదానిలా వణికిపోయింది నర్మద.

సరిగ్గా అప్పుడే గేటు తెరచిన చప్పుడయ్యింది. తల తిప్పి చూస్తే చేతితో వెడల్పుగా వున్న సంచీని పట్టుకొని లోపలకు వస్తున్న ప్రకాశం కనిపించాడు. సంచీలోనించి బయటకు కనపడుతున్న పళ్లపొడి పొట్లాలు నర్మదను నవ్వుతున్నట్టు చూశాయి. చూశావా ప్రకాశం మమ్మల్ని ఎట్లా మోస్తున్నాడో నన్నట్టు.

"నాకోసమేనా ఎదురుచూస్తున్నావు?" పరిహాసమాడాడు ప్రకాశం సంచీని గోడవారగా వుంచి చేతిని విదుల్చుకుంటూ.

నీళ్లు పోయడం మరచిపోయిన కుండీలో ఎండిపోయిన మొక్కలాంటి ఈ మనిషినా తను పెళ్లి చేసుకునేది? అనుకుంది నర్మద. అలా అనుకుంటే ఆమెకి ఎవరో తనని సహారా ఎడారిలో పైనించి కిందికి వదిలి ఒంటరిగా వుంచి వెళ్లిపోయినంత బాధ కలిగింది.

ఒకప్పుడు ప్రకాశంని చూసి సన్నగా నాజూగ్గా వున్నాడనుకునేది. కాని ఎన్‌లార్జ్ చేసిన ఫారెక్స్ బాయ్‌లా వున్న కార్తికేయరావును చూసిన తర్వాత ఈ ప్రకాశం సరయిన గాల్లో నిలబడగలడా? అనిపిస్తోంది.

ప్రకాశం రాకతో నర్మద ఆలోచనలన్నీ స్ట్రయికింగ్ ఇచ్చిన కేరమ్స్ కాయిన్లలా చెదిరిపోయాయి.

ఆ సాయంత్రం ప్రకాశం నర్మదనీ, ఇందుమతినీ సినిమాకు తీసుకెళతానన్నాడు. నర్మద తల్లిని కూడా రమ్మన్నాడు కానీ ఆమె పనుందని రానని చెప్పింది. నర్మదకి ప్రకాశం మీద ఇంట్రస్టు లేకపోయినా సినిమామీద ఇంట్రస్టుతో బయల్దేరింది. అంతేకాకుండా తను ఈమధ్యనే కొన్న ప్రింటుపూల చీరను నలుగురికీ చూపించే అవకాశం కూడా వుంటుందని సరేనన్నది. ఇవేమీ తెలీని ప్రకాశం అదంతా నర్మదకు తనమీద ప్రేమనుకున్నాడు.

థియేటర్లోకి వెళ్లి తన సీట్లో కూర్చోబోతూ ఎందుకో వెనక్కు చూసింది నర్మద. ఎవరో మీట నొక్కినట్టూ, గుండె ఆగినట్టూ అనిపించింది. సరిగ్గా వెనక సీట్లో కార్తికేయరావు కూర్చుని వున్నాడు అదే నవ్వుతో. అందమైన కవ్విస్తున్న కళ్లతో ఆమెనే చూస్తున్నాడు. అతడి చూపులు ఆమె శరీరాన్ని తాకుతున్నట్టుగా అనిపించాయి. ప్రకాశం గమనిస్తాడని దబ్బున కుర్చీలో కూర్చుంది ఆమె. పక్కనే ప్రకాశం కూర్చునివున్నాడు. ఒకవైపు ఇందుమతి కూర్చుంది. ఏదైనా మాయ జరిగి కార్తికేయరావు ప్రకాశం సీట్లోకి మారితే బావుండుననిపించింది.

న్యూస్‌రీల్స్ వేస్తున్నారు.

నర్మద దృష్టి వాటిమీద లేదు. కార్తికేయరావు కాళ్లు తనకు తగుల్తాయేమో వెనకనించని ఎదురుచూస్తోంది ఆమె. ఎంతసేపు చూసినా తగల్లేదు.

సినిమా మొదలయ్యింది. నర్మదకు గాలి పీల్చటమే కష్టంగా వుంది. ఇహ లాభం లేదనుకుని సినిమా చూట్టంలో లీనమయిన దానిలా రిలాక్సింగ్‌గా కుర్చీలో వెనక్కు వాలింది బాగా. తన తల్లో పెట్టుకున్న మల్లెపూల పరిమళం కార్తికేయరావును చేరుకోవాలని ఆమె ఉద్దేశం.

సినిమా జరుగుతోంది.

కోయవాళ్ల డేన్స్ చూస్తున్న హీరో హీరోయిన్లు పాట రెండో చరణానికి వాళ్లూ కోయవాళ్లుగా మారిపోయినట్టు నర్మద ఆ సినిమాలో హీరోయిన్‌గా మారిపోయి వెనక సీట్లో కూర్చున్న కార్తికేయరావును హీరోగా మార్చేసింది తన ఊహాశక్తితో.

అతడితో కలిసి ఈ దేశంలోనే కాకుండా ఇతర దేశాల బస్టాండుల్లో, విమానాశ్రయాల రన్‌వేల మీద పాటలు పాడింది. ఫారెన్ ఎగ్జిబిషన్లలో జయింట్ వీల్స్‌ను ఎక్కి తిరిగింది. రకరకాల డ్రస్సులు మార్చింది.

ఉన్నట్టుండి లైట్లు వెలిగాయి. ఇంటర్వెల్ అని గ్రహించింది నర్మద కొంచెంసేపటికి.

"హీరోయిన్ బావుందికదూ?" అనడిగాడు ప్రకాశం.

"హీరోయిన్ ఎవరు?" అనడిగింది నర్మద.

"నిద్రపోతున్నావా ఏంటి?" అని మళ్లీ పరిహాసమాడాడు వెనక సీట్లో కార్తికేయరావు కూర్చుని వున్నాడని తెలీని ప్రకాశం.

"ఎందుకనో అక్క చాలా మూడీగా వుంది" అంది ఇందుమతి.

"అర్థమయ్యిందిలే" అంటూ బలహీనంగా నవ్వాడు ప్రకాశం. తనని హీరోయిన్‌గానూ, ప్రకాశాన్ని హీరోగానూ ఊహించుకుంటోందని అనుకుని.

ఇంటర్వెల్‌లో కార్తికేయరావు డ్రింక్ తాగడాన్ని చూసింది నర్మద. ఆమెకయితే అతను తననే డ్రింక్ కింద మార్చి తాగుతున్నట్టుగా అనిపించి సిగ్గుపడిపోయింది. ప్రకాశం – నర్మద ఇంకా సినిమాలో ప్రేమ సన్నివేశాలను తల్చుకుని సిగ్గుపడుతుందని అనుకుని "మరి ప్రేమంటే అంతే" అన్నాడు.

నర్మద ఆశ్చర్యంగా చూసింది ప్రకాశాన్ని.

ప్రకాశం రెండు పాప్‌కార్న్ పొట్లాలు కొని వాళ్లిద్దరికి చెరొకటి ఇచ్చాడు.

"నీకో" అన్నది ఇందుమతి.

"ఈ మొక్కజొన్న పేలాలు రోజూ తింటూ వుంటాన్లే. మీరు తినండి" అన్నాడు చలా ఈజీగా. మళ్లీ సినిమా మొదలయ్యింది.

నర్మద మళ్లీ సీట్లో వెనక్కు వాలిపోయింది.

కొంచెంసేపటి తర్వాత "సరిగ్గా కూర్చోనే పూలు నలిగిపోతాయ్" అంది ఇందుమతి చిన్నగా.

మాట్లాడలేదు నర్మద.

సినిమా వదిలాక బయటకు వచ్చేటప్పుడు నర్మద భుజానికి కార్తికేయరావు భుజం రాసుకున్నది. విద్యుత్తు ప్రవహించినట్లయ్యింది.

ఆ రాత్రి కూడా నిద్రకు దూరమయ్యింది నర్మద. కార్తికేయరావును తీసుకుని ఆమె హనీమూన్‌కు నైనిటాల్‌కు వెళ్లింది. ప్రకాశం తనని తీసుకుని - అరకులోయకు వెళ్లాడని ఆమెకు తెలీదు.

❖ ❖ ❖

రెండు నెలలకే ఎప్పట్నించో అనుకుంటున్నట్టుగానే నర్మదకి ప్రకాశంకి పెళ్లి జరిగింది. ప్రకాశం తన మెళ్లో మూడు ముళ్లూ వేస్తున్నప్పుడు ఎటువంటి భావానికి లోనుగాకుండా కూర్చుంది నర్మద.

పెళ్లయిన ఐదో రోజు ముందుగదిలో కిటికీ దగ్గరకు వచ్చి ఎదురింటి మేడమీద గదికేసి చూసింది నర్మద ఉదయం పది గంటలు కావస్తున్నప్పుడు.

ఆ సమయానికి మామూలుగానే కిటికీ చువ్వల మధ్య అద్దాన్ని ఇరికించి తల దువ్వుకుంటున్నాడు కార్తికేయరావు. మళ్లీ తనే స్వయంగా అతడికి తల దువ్వాలనిపించింది ఆమెకి. ఉన్నట్టుండి ఆమెకూ తనకు పెళ్లయిన విషయం గుర్తుకువచ్చింది. సరిగ్గా అప్పుడే కార్తికేయరావు తలెత్తి ఆమెను చూసి, అదోలా నవ్వాడు.

"ఛీ.... పాడు మనుషులు వెకిలిచూపులు ఎందుకో అట్టా చూట్టం?" అనుకుంటూ భుజాల చుట్టూ పమిట కప్పుకుని లోపలకు వచ్చింది ప్రకాశం భార్య. ❖

*స్వాతి వారపత్రిక, 13-5-1994*